# అల్లుడు

ఎం.వి.జె.భువనేశ్వరరావు




క్రైన్ కథలపోటీలో
సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ

**ఆ**ఫీస్ నుండి ఇంటికి వచ్చిన సుబ్బారావుకి 'కాఫీ' తీస్కుని వచ్చింది భార్య శ్రీలక్ష్మి.

"లక్ష్మీ జగదాంబ జంక్షన్‌లో మనం ప్లాటు కొనాలంటే మరో రెండు లక్షలవసరముంటుంది. మనదగ్గరున్న ఐదు లక్షలకైతే ఆ ఏరియాలో ఏదీ దొరకడంలేదు." కాఫీ సిప్‌చేస్తూ చెప్పాడు సుబ్బారావు.

"మరేంచేస్తాం. మరో రెండు లక్షలు అప్పు తీసుకోవాల్సిందే మరి" అన్చెప్పి వంటగదివేపు దారితీసింది లక్ష్మి.

ఆమె వెంటపడ్డాడు సుబ్బారావు.

"అదికాదు లక్ష్మీ! మీనాన్నగార్నడుగుదాం"

"ఇప్పటికే చాలాసార్లు వాళ్ళని ఇబ్బంది పెట్టాం. ఇకనైనా ఫుల్‌స్టాప్ పెట్టండి." కోపంగా అంది శ్రీలక్ష్మి.

"లక్ష్మీ! ఇంకా లోన్ తీస్కుంటే మన చేతికిక జీతం రాదు."

"వాళ్ళనింకా ఏ మొహంపెట్టుకుని అడుగుతాం. ఈ సారిమ్మంటే మాత్రం ఛీ పొమ్మంటారు."

"దానికి నేనో ప్లాన్ వేశాను. నీ ప్రవర్తన బాగుండ లేదని.... నీకూనాకు పొసగటంలేదని. అందుకని నీ నుండి విడాకులు తీస్కుంటానని మీ వాళ్ళని బెదిరిస్తాను. మీయింట్లో పెళ్ళీడుకొచ్చిన మీ చెల్లి ఉంది. కాబట్టి భయపడి బ్రతిమ లాడతారు. అప్పుడు రెండు లక్షల విషయం చెప్తాను. సొమ్ముతో పాటు నిన్నూ తీసుకొని వచ్చేస్తాను."

అది విని అసహ్యం, రోత పుట్టాయి శ్రీలక్ష్మిలో...

"మీరూ మనుషులేనా? మీకసలు మానవత్వం ఉందా? మీకంటూ పరువూ ప్రతిష్ఠ అక్కర్లేదా? " అని సూటిగా అడిగింది. అలా చేయొద్దని వారించింది. తాను పుట్టింటికి వెళ్ళనని భీష్మించింది. సుబ్బారావులో చలనంలేదు.

అబలగా శ్రీలక్ష్మి అంగీకరించక తప్పలేదు. మౌనంగా సూట్‌కేస్‌తో పుట్టింటికి బయలుదేరింది.

☆ ☆ ☆

నెల రోజులు గడిచాయి...

హోటల్‌లో తింటూ తినక సుబ్బారావు ఎలాగోలా నెట్టుకొచ్చేస్తున్నాడు....

రెండు నెలలు దొర్లాయి. మూడు నెలలు అయినా శ్రీలక్ష్మి జాడలేదు. అత్తగారింటి నుండి కబురులేదు. రారమ్మని పిలుపులేదు.

బ్రతిమలాడుతారనుకుంటే కనీసం కనుచూపు మేరలో ఆ పరిస్థితి కానరావటంలేదు. సుబ్బారావులో ఆందోళన మొదలైంది.

"పోస్ట్" అనే కేకతో ఈ లోకంలోకి వచ్చాడు. సుబ్బారావు. మామగారి నుండి వచ్చిన లెటరే అది. ముఖం నిండా వెలుగులు కమ్ముకున్నాయ్. గబగబా ఓపెన్‌చేసి చదివాడు.

" అల్లుడు సుబ్బారావుకి! మామగారి ఆశీర్వాదములు!...

మూడు నెలలుగా మీ నుండి రాకపోకలు లేవు.........

ఉత్తరాలు లేవు. అమ్మాయి క్షేమమేనా? బుధవారం అమ్మాయి. మీరు కల్సి వెంటనే రావాల్సింది. అత్తయ్య మిమ్మల్ని అడిగినట్లు చెప్పమంది. ఉంటాను.

ఇట్లు

మామగారు. "

"సుబ్బారావుకి ముచ్చెమటలు పోశాయి.

"శ్రీలక్ష్మి ఏమైనట్లు?" మనసంతా భారమైంది.

మెదడు నుండి ఏవేవో ఆలోచనలు విశృఖలంగా వెల్లువెత్తుతున్నాయి. ఏం చెయ్యాలో అర్థంకాలేదు.

డబ్బుకోసం ఆశపడితే ప్రియమైన భార్య అదృశ్యమైంది.

మామగారు అబద్ధం చెప్తున్నారేమోనని సందేహం కలిగింది. మరో మార్గం కూడా లేదు.

ఖచ్చితంగా శ్రీలక్ష్మి అక్కడే ఉండి తీరాలి.

రెప్పపాటు సమయంలో అన్నీ సర్దుకొని మామగారింటికి బయలుదేరాడు. నాల్గు గంటలు ప్రయాణం సల్పితేకాని ఊరు చేరలేదు.

"రావయ్యా అల్లుడూ ....... రా..... అంతా కులాసాయేనా?" సాదరంగా ఆహ్వా నించాడు. మామ..

"అవును అమ్మాయీ పిల్లలు ఏమయ్యారు మీరొక్కరే వచ్చారు.?" ఒంటరిగా వచ్చిన సుబ్బారావును చూసి ఆదుర్దాగా అడిగింది అత్త గారు. గుండాగినంత పనయింది సుబ్బారావుకి. సమాధానమేం చెప్పాలో అర్థం కాలేదు. ఒక్క నిముషం పాటు నిశ్శబ్దంగా ఉండి పోయాడు. అందరి చూపులూ సుబ్బారావు వేపే...

ఏమీ చెప్పలేక సిగ్గుతో తలదించు కొన్నాడు.

" ఏమైంది అల్లుడూ! అమ్మాయి పిల్లలు ఏమయ్యారు? మాట్లాడవేం" గద్దించాడు మామ.

ఒక్కసారిగా పెద్దపెట్టున ఏడుపు లంకించుకున్నాడు సుబ్బారావు.."నన్ను క్షమించండి మామగారూ. తప్పంతా నాదే. డబ్బు కోసమని లేని అభాండంవేసి మీ వద్దకు పంపాను శ్రీలక్ష్మిని. ఇక్కడే ఉందనే ధీమాతో ఇంతకాలం ఓర్పుగా ఉన్నాను. ఇక్కడ లేదంటే ఏమైందో?" మరింతగా దీర్ఘాలు తీశాడు. సుబ్బారావుని వారించటం ఎవరి తరమూ కాలేదు. అతని బాధలో అంతా శృతి కలిపారు. సరిగ్గా అప్పుడే సూట్‌కేస్‌తో సహా లోనికి ప్రవేశించింది శ్రీలక్ష్మి. "ఏమైంది?" గట్టిగా అరిచింది. అటువేపు చూసి అంతా నిర్ఘాంత పోయారు. ఆశ్చర్యం, ఆనందం వాళ్ళ ముఖాల్లో కొట్టొస్తోంది. సుబ్బారావైతే 'నిధి' దొరికినంత ఆనందంతో శ్రీలక్ష్మి వద్దకు పరుగెత్తాడు.

" ఇంత కాలం ఏమయిపోయావ్ లక్ష్మీ తప్పయిపోయింది. నన్ను క్షమించు. నువ్వులేక పోతే నేనెలా ఉండగల్ను?"ఆతృతగా అడిగాడు.. లోలోపల నవ్వు తన్నుకొస్తున్నా బలవంతంగా ఆపుకొంది శ్రీలక్ష్మి.

" క్షమించండి. మిమ్మల్ని బాధ పెట్టి నందులకు! మా అమ్మానాన్నల వద్ద కొచ్చి అలా చెప్పటం, డబ్బుకోసం అంతగా దిగజారటం నాకు నచ్చలేదు. అందుకే వాళ్ళ దగ్గరికెళ్ళలేక మీ వద్ద ఉండలేక విజయవాడలో ఉన్న నా ఫ్రెండ్ వద్దకెళ్ళిపోయాను. అది ఉంటున్నది వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో కావటం వలన నాకేం ఇబ్బంది కలగలేదు. అయితే ఎప్పటి కప్పుడు ఫోన్‌లో మన ఎదురింటి వనజగారి ద్వారా మీ గురించి తెల్సుకొంటున్నాను మీరిలా బాధతో వచ్చేసారని అది చెప్పగానే నా గురించి వెతుక్కుంటూ యిక్కడికే వస్తారని తెల్సి డైరెక్టుగా యిలా వచ్చేసాను." గడగడాచెప్పేసింది.

"కొంపదీసి యిలాయని మీ నాన్నగార్ని అడగలేదు కదా! రక్షించావు. నా పరువు పోకుండా కాపాడావు." అప్యాయంగా ఆమెను పట్టుకున్నాడు సుబ్బారావు.

" లేదండి మీరేం భయపడకండి అలాంటివేం లేదు. హాయిగా ఉండండి....."

మనస్ఫూర్తిగానే చెప్పింది.

భార్య శ్రీలక్ష్మి ఓ అనురాగదేవతలా కన్పించింది. ఆక్షణంలో!....

కథ సుఖాంతమైనందుకు ఆనందంగా మారిపోయింది అక్కడి వాతావరణం. అంతా కలిసి భోజనం చేశారు. మర్నాడు మరదలు పెళ్ళి చూపులవకుండానే తిరుగు ప్రయాణ మయ్యారు సుబ్బారావు, శ్రీలక్ష్మి.

సుబ్బారావు డైరీలో ఓ ఆనందకరమైన రోజు. చాలా హ్యాపీగా ఉన్నాడు. శ్రీలక్ష్మి, సుబ్బారావుల పెళ్ళిరోజు..

అపురూపమైన ఆరోజు రాత్రి శ్రీలక్ష్మిని చెంతకు చేర్చుకొని....

గాఢంగా కౌగిలించుకొన్నాడు. అంతటితో ఆగకుండా "లక్ష్మీ.. నీకేం గిఫ్టు కావాలో చెప్పు వారం రోజుల్లో కొనిస్తాను." అన్నాడు.

"నాపై ప్రేమ ఇలాగే చిరకాలం కొన సాగితే చాలు. అయితే నేనో తప్పుచేశాను. క్షమించానని చెప్తే చెప్తాను." పాదాలపై పడింది. మన మధ్య క్షమాపణలేంటి. నువ్వు తప్పు చేశా వంటే ఏదో మంచికోసమే చేసుంటావు. ఫర్వాలేదులే చెప్పు..." సుబ్బారావులో ఉత్సుకత పెరిగింది.

"నేను వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉన్నానని చెప్పాను కదా! అది అబద్ధమండి" శ్రీలక్ష్మి అలా చెప్పగానే ఆదిరిపడ్డాడు. సుబ్బారావు... ఆశ్చర్యంగా అడిగాడు. "అయితే మరెక్క దున్నావ్?"

"మా ఆయన చాలా మంచివారు. ఎవరు సలహా యిచ్చారో ఆయనకి మీ నుండి రెండు లక్షలు తీస్కోవాలనే దురాలోచన వచ్చింది. ఆయనలో మార్పు రావటానికి మీరు సహక రించండి'అని మా అమ్మ, నాన్నలతో చెప్పి నేనే లెటర్ వ్రాయటం దగ్గర్నుండి నేను నా ఫ్రెండ్ దగ్గర్నుండి వచ్చినట్లుగా నాటక మాడటం వరకూ నటించేశాం" నిజానికి నేనెక్కడికీ వెళ్ళ లేదు. మీరొచ్చే ముందే మా వెనకింటి వాళ్ళింట్లో ఉండి నా ఫ్రెండ్ దగ్గర్నుండి హాస్టల్ నుండి డైరెక్టుగా వచ్చినట్లుగా నమ్మించాం.... మీరంటే ఉండే అభిమానం, గౌరవం మా పుట్టింటివారి దగ్గర తగ్గ కూడదనే ఇలా చేయాల్సి వచ్చింది. నన్ను క్షమించండి." కన్నీళ్ళ పర్యంతమైంది.

"ఛ.ఛ... అదేంటి శ్రీలక్ష్మి... నువ్వే నన్ను క్షమించాలి. నా భార్యవని కూడా చూడకుండా నిన్నెంతో మానసిక సంఘర్షణకు గురిచేసి బాధ పెట్టాను. నాలోని దుర్మార్గపు దురాశా ప్రేరితమైన ఆలోచనలను పారద్రోలి... మార్పు కలిగేలా చక్కగా వ్యవహరించావు......హేట్సాఫ్...." మరింత గాఢంగా ఆమెను తనివి తీరా ... ప్రేమ నిండిన మనస్సుతో గుండెలకు హత్తు కొన్నాడు.